క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు

జనగామ: పట్టణంలో రెవెన్యూ టికెట్లతో పాటు కోర్టుకు సంబంధించిన జుడిషియల్ స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని వంతం రాంచంద్రారెడ్డి శుక్రవారం సబ్ రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. లైసెన్స్ ఉన్న వారితో పాటు అనుమతులు లేకుండా బాధ్యతా రహితంగా వీటిని విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్టాంపులు విక్రయించే దుకాణంలో అందరికి అందుబాటులో ఉండే విధంగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సబ్ రిజిస్ట్రార్ ఆదేశించారు.

'హామీని నెరవేర్చాలి'

చిల్పూరు: ఎన్నికల సమయంలో నష్కల్ ఆకేరు వాగుపై బ్రిడ్జి నిర్మించి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. నష్కల్ ఆకేరు వాగు వద్ద శుక్రవారం రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. కనుకయ్య, శంకర్, రవి, కొమురయ్య తదితరులు ఉన్నారు.

సన్మానం

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో హిందీ ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ఓబుల్ కేశవాపూర్ ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మిర్యాల రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. వజ్రయ్య, సురేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

పల్లగుట్టలో..

చిల్పూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పీఈటీ దేవ్‌సింగ్‌ను శుక్రవారం పల్లగుట్ట పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఎల్లభట్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, జీడి ఆనందం, కేసోజు నిరంజన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు..

నర్మెట: బొమ్మకూర్ పూర్వ ప్రాథమిక పాఠశాల (అంగన్‌వాడీ కేంద్రం)లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న అంగన్ వాడీ టీచర్లను హెచ్‌ఎం మెరుగు రామరాజు, ఉపాధ్యాయుడు అంకం రాజ్ కిరణ్, కార్యదర్శి ఎదునూరి సుజాతలు శాలువాలతో సత్కరించారు.

ఎన్నిక

పాలకుర్తి టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న మండల పరపతి సంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రవణ్‌కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మెరుగు ఉప్పలయ్య గౌడ్, కార్యదర్శిగా బాలగాని యాకయ్య, సహాయ కార్యదర్శిగా గాదెగాని మహేందర్, కోశాధికారిగా కారుపోతుల శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గిరగాని కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా కమ్మగాని నాగయ్య, బొమ్మగాని భాస్కర్, పెద్ది అంజయ్య, నాతి వన్నయ్య ఎన్నికయ్యారు.

పిడుగు పాటుతో ట్రాన్స్‌కోకు రూ. 6 లక్షల నష్టం

చిల్పూరు: గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగు పాటుతో రూ. 6లక్షల వరకు ట్రాన్స్‌కోకు నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ ఏఈ గోలి లక్ష్మీనారాయణ తెలిపారు. రాత్రి ఒక్కసారిగా చిన్నపెండ్యాల గ్రామంలో పిడుగు పడడంతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు చెప్పారు. దీంతో మండలంలో పలు చోట్ల 33కేవీ స్తంభాలపై పిడుగుపడడంతో 6 ఇన్సులేటర్లు కాలిపోయాయని తెలిపారు. శ్రీపతిపల్లిలో విద్యుత్ స్తంభం పడిపోగా సిబ్బంది గడ్డం సిద్దయ్య ఇచ్చిన సమాచారంతో శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు.

యూరియా కోసం లైన్‌లో పాస్‌బుక్స్



బచ్చన్నపేట: సకాలంలో యూరియా అందన అన్నదాతలు అరిగోస పడుతున్నారు. శుక్రవారం మండలంలోని కొన్నె గ్రామంలో పీఏసీఎస్ క్లస్టర్‌లో యూరియా కోసం రైతులు తమ పాస్‌బుక్‌ల జిరాక్స్ కాపీలను లైనులో ఉంచారు. మండలంలో పాస్‌బుక్‌ల జిరాక్స్ కాపీలను ఇచ్చిన మరుసటి రోజు యూరియాను రైతులకు అందజేస్తున్నారు. కానీ క్లస్టర్‌ల వారీగా యూరియాను పంపిణీ చేస్తున్న సమయంలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

బియ్యం అందజేత

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన మరికుకాల వసంత ఇటీవల బోన్ కేన్సర్‌తో మరణించిన విషయం విదితమే. శుక్రవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొయ్యడ లక్ష్మీప్రభాకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం అందజేశారు.

చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- 400 ఇళ్లలో 383 పనులు ప్రారంభం
- రెండు నెలల్లోనే 20 ఇళ్లు స్లాబ్ లెవల్ పూర్తి
- లబ్ధిదారులే నేరుగా అప్‌లోడ్ చేసుకొనే అవకాశం

లింగాలఘణపురం: గత పదేళ్లుగా ఇళ్ల నిర్మాణం కోసం ఎదురు చూసిన ప్రజలు నేడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కావడంతో నిర్మాణాలు చురుగ్గా కొనసాగిస్తున్నారు. మండలంలో మొదటి విడత కొత్తపల్లిలో 35 ఇళ్లు మంజూరు కాగా రెండో విడత 365 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 400 ఇళ్లు కాగా 17 ఇళ్లు తాము నిర్మించుకొనే స్థితిలో లేమని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడంతో వాటిని రద్దు చేసి కొత్తవారి కోసం సిఫారసు చేసినట్లు తెలిసింది. కాగా రెండో విడత ఇళ్లు జూన్ 2న ముగ్గులు పోసి పనులు మొదలు పెట్టారు. అప్పటి నుంచి పనులను వేగవంతం చేస్తున్నారు. మండలంలో 322 ఇప్పటికే బేస్‌మెంట్ వరకు పూర్తయాయి. అందులో 257 మందికి రూ.లక్ష చొప్పున బిల్లులు కూడా వారి ఖాతాలో జమ అయ్యాయి. 81 ఇళ్లు రూఫ్‌లెవల్ కాగా 30 మందికి రూ.2 లక్షల బిల్లు, 20 స్లాబ్ లెవల్ రాగా అందులో 12 మందికి రూ.3 లక్షల బిల్లు కూడా వచ్చాయి. ఇలా మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతుంది.



మండల కేంద్రంలో రూఫ్ లెవల్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

లబ్ధిదారులే నేరుగా అప్‌లోడ్ చేసుకొనే అవకాశం..

ఇక నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులే బిల్లు కోసం తమ ఇళ్ల ఫొటోలను అప్‌లోడ్ చేసుకొనే అవకాశం కల్పించింది. అందుకు లబ్ధిదారులు తమ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోనికి వెళ్లి ఇందిరవథిళ్ల గర్నమెంట్ ఆఫ్ తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ బెనిఫిషరీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఐడీతో లాగిన్ కాగానే ఓటీపీ వస్తుంది. దీంతో లబ్ధిదారులు ఆయా ఇళ్ల స్టేజీని బట్టి సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు. పంచాయతీ కార్యదర్శులే వచ్చి ఫొటో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా లబ్ధిదారులే అప్‌లోడ్ చేసి జీపీ కార్యదర్శికి సమాచారం ఇస్తే సరిపోతుంది. అంతేకాకుండా టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా ఫోన్ చేసి బిల్లుల స్టేజీని తెలుసుకోవచ్చు. అందుకు ప్రభుత్వ పని దినాల్లో 18005995991 నంబర్‌కు కాల్ చేయొచ్చు.

గ్రౌండింగ్‌లో ప్రథమ స్థానం



ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణంలో లింగాలఘణపురం మండలం ప్రథమ స్థానంలో ఉంది. లబ్ధిదారులంతా పనులు ప్రారంభించారు. 12 మందికి స్లాబ్ లెవల్ బిల్లులు కూడా వారి ఖాతాల్లో జమ అయ్యాయి. బిల్లులు కూడ ఆయా స్థానిక బ్యాంకులోనే జమ అవుతున్నాయి. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఏమీ లేవు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఇచ్చింది.

\- రఘురామకృష్ణ, ఎంపీడీఓ

మూడోసారి కల్వర్టు ధ్వంసం

- జనగామ–హుస్నాబాద్‌కు రాకపోకలు బంద్
- అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కొటుకుపోయిన గానుగుపహడ్ తాత్కాలిక రోడ్డు

జనగామ రూరల్: మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు జనగామ–హుస్నాబాద్ రహదారి వడ్లకొండ వద్ద ఉన్న బ్రిడ్జి కూలిపోయింది. దీంతో గత ప్రభుత్వం హయంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. బ్రిడ్జి మంజూరు అయిన వెంటనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి నిధులు విడుదల కాక పోవడంతో పిల్లర్ల వరకు నిర్మించి వదిలివేశారు. కాగా, బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు, కల్వర్టు రెండు సార్లు భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో తాత్కాలింగా కంకరతో మట్టి రోడ్డు వేశారు. మళ్లీ గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలను పోలీసులు బంద్ చేశారు. దీంతో మూడు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ నెల రోజుల పాటు కలెక్టరేట్ వద్ద దీక్షలు చేసినా స్పందించలేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించా..



గానుగుపహడ్ బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేసి బ్రిడ్జి పూర్తి చేయాలని రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు ప్రస్తావించా. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి అందజేశా. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాలి. - పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే

బ్రిడ్జి నిర్మాణంపై పట్టింపు లేదు



జిల్లా కేంద్రానికి రావాలంటే మూడు మండలాల ప్రజలు గత మూడు ఏళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. పెండింగ్ బిల్లు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి. అధికార పార్టీ నాయకులకు, అధికారులకు పట్టింపు లేదు. కలెక్టర్, ఎమ్మెల్యే పట్టించుకుని బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

\- సౌడ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జఫర్‌గఢ్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కూనూర్ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రాజమౌళి కోరారు. కూనూర్ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ రాజమౌళి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ చందర్, ఏఎన్‌ఎం శ్రీలత తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత అలవర్చుకోవాలి

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అలవర్చుకోవాలని మండల వైద్యాధికారి రాజపురి రవితేజ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎన్‌ఎం వసంత, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

జీవనోపాధి పెంచుకోవాలి

దేవరుప్పుల: మారుతున్న ఆధునిక పరిజ్ఞానంతో తమ వృత్తి నైపుణ్యంతో ఫొటో గ్రాఫర్లు జీవనోపాధి పెంపొందించుకోవాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నార్సింగ్ ఓం కన్వెన్షన్‌లో తలపెట్టిన 2025 ఫొటోగ్రఫీ ఫెస్టివల్ (ఎక్స్‌పో) వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, ఉపాధ్యక్షులు నల్ల సతీష్, నాయకులు అమృతం ఆంజనేయులు, గుగులోత్ నరేందర్ నల్ల లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన ఆలయ చైర్మన్

బచ్చన్నపేట: మండలానికి నూతనంగా వచ్చిన ఎంపీడీఓ మమతాభాయ్‌ను కొడవటూర్ దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సహకరిస్తామని చెప్పారు.

నివాళి

జనగామ రూరల్: పాముకుంట్ల పెద్ద యదగిరి వర్ధంతిని పట్టణలోని ఎస్‌ఎమ్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా గోపా వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా పరశురాములు పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారులు మధుసూదన్, సుధాకర్, సంతోష్, లక్ష్మీనారాయణ, రంగు మల్లయ్య పాల్గొన్నారు.

బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ సాంప్రదాయమైన బతుకమ్మ పండుగకు ముందు వచ్చే బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారం పల్లెల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు చిన్నారులు, యువతులు, మహిళలు అలంకరించిన బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడి ఆనందంగా గడుపనున్నారు.



బొడ్డెమ్మ వేడుకల్లో చిన్నారులు, మహిళలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- పార్టీ రాష్ట్ర నాయకుడు శశిధర్ రెడ్డి

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంకురి శశిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శానబోయిన మహిపాల్ అధ్యక్షతన సేవాపక్షం కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర పథకాలను ఇంటింటా తీసుకెళ్లి వివరించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేవైఎం రాష్ట్ర నాయకుడు చింత కింది సంతోష్, ఇర్ల నవీన్ కుమార్, చింత పండు రాజు, కనకరెడ్డి, అభినయ్, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు

'ఓడిపోతామనే ఎన్నికలు నిర్వహించడం లేదు'

తరిగొప్పుల: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి జరగడంలేదని, ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంలేదని సేవా పక్షం జిల్లా కోకన్వీనర్ ఈర్ల నవీన్‌కుమార్ అన్నారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం మండలకేంద్రంలో సేవా పక్షం కార్యశాల నిర్వహించారు. ఏడెల్లి రాంనర్సింహారెడ్డి, తలకొక్కుల శ్రీనివాస్, రాంబ్రహ్మాచారి, కొన్నె రాజు, రాజునాయక్, రాజు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

రైతు సంక్షేమంలో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: రైతు సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం కోలుకొండలో ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతులు పాట్లుపడుతుండగా పాలకుర్తి వైపు వెళ్తున్న ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈఓ సనాతో యూరియా పంపిణీ స్థితిగతులపై తెలుసుకుని మాట్లాడారు. ఖరీఫ్ సాగు పంటలకు సకాలంలో యూరియా అందని దుస్థితితో పంటల దిగుమతి తగ్గితే కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

పరామర్శ

మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం సింగరాజుపల్లిలో రచ్చ మల్లయ్య, కడవెండిలో మృతులు దరగాని సోమక్క, బత్తిని యాదయ్య, బూడిద నర్సయ్య, భాషిపాక సోమయ్య, కందుల సందీప్, లక్ష్మి కుటుంబాలతోపాటు ప్రమాదంలో గాయపడ్డ ఇంగె భిక్షపతిలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట పల్లసుందర్‌రామిరెడ్డి, తీగల దయాకర్, ఏల సుందర్, అర్జున్, సోమనర్సయ్య, గడ్డం రాజుమహేష్ తదితరులు ఉన్నారు.



వ్యవసాయఅధికారులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

'ఏచూరి' ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్/జఫర్‌గఢ్/బచ్చన్నపేట: సీపీఎం అఖిల భారత మాజీ కార్యదర్శి సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జనగామ పట్టణంలో, జఫర్‌గఢ్, బచ్చన్నపేట మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏచూరి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, గుండెబోయిన రాజు, కాట సుధాకర్, రవీందర్‌రెడ్డి, అశోక్, ఐలయ్య, సమ్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి బదిలీ నిలిపివేయాలి



బచ్చన్నపేట: తమ్మడపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి బదిలీని నిలిపివేయాలని పలువురు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయుడు లేకపోతే విద్యార్థుల చదువుకు ఇబ్బంది ఏర్పడుతుంది కావున చిన్నరామన్‌చర్లకు చేసిన నర్సిరెడ్డి బదిలీని నిలిపివేయాలన్నారు. ఎస్‌ఎంసీ నూనెముంతల నరేందర్ గ్రామస్తులు కంసాని సిద్దారెడ్డి, రాజు, దొమ్మాట కరుణాకర్, ముక్క భాస్కర్ , దాసరి శ్రీనివాస్‌రెడ్డి, మధుపాటి భవాని ఉన్నారు.

మహిళను హత్య చేసిన కుమార్తె, అల్లుడు అరెస్ట్

- వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

పాలకుర్తి టౌన్: ఆస్తికోసం మహిళను హత్య చేసిన కేసులో కుమార్తె, అల్లుడితోపాటు కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. శుక్రవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలకుర్తి సీఐ జానకీరాంరెడ్డి, ఎస్సై దూలం పవన్‌కుమార్ కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని పెద్ద తండా(కే)కు చెందిన బాదావత్ లక్ష్మి(42) వ్యసాయ పనులు చేస్తు జీవనం సాగిస్తోంది. ఆమె భర్త తిరుపతి 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఏకైక సంతానమైన సంగీతను దుబ్బతండా(ఎస్‌పీ)కు చెందిన బానోత్ వీరన్నకు ఇచ్చి వివాహం చేశారు. తల్లి తన పేరిట ఉన్న వ్యవసాయ భూమి నుంచి 25 గుంటల వ్యవసాయ భూమిని విక్రయించి వచ్చిన రూ.15 లక్షల్లోంచి సంగీతకు రూ.3 లక్షలు, 8 తులాల బంగారం కొనిచ్చింది. లక్ష్మికి అప్పులు ఉండడంతో రూ.5 లక్షల నగదుతో పాటు 20 గుంటల భూమి తన పోషణ నిమిత్తం ఉంచుకుంది. మృతురాలు లక్ష్మి వద్ద ఉన్న 20 గుంటల భూమి, జనగామలో ఉన్న ప్లాటును తనకు ఇవ్వాలని కుమార్తె తరచూ గొడవపడేది. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన రాత్రి 12 గంటల ప్రాంతంలో సంగీతతో పాటు ఆమె భర్త వీరన్న, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నార్సింగ్‌తండాకు చెందిన కారు డ్రైవర్ భూక్యా సామ్రాజ్ పెద్దతండాకు చేరుకుని నిద్రలో ఉన్న లక్ష్మి ముఖంపై దిండుతో అదిమి హత్య చేశారు. పరారీలో ఉన్న నిందితులను శుక్రవారం శాతపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని ఆరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హత్య చేసేందుకు తీసుకు వచ్చిన కారును సీజ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ ఆస్తి కోసం కన్న తల్లినే హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. హత్యలే ఆస్తులకు పరిష్కారం కాదని, సామరస్యంగా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ముగ్గురు నిందితులను ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ జి.సోమిరెడ్డి, కానిస్టేబుళ్లు బి.రమేష్, వి రాజ్‌కుమార్, పి.యాకన్న, మనోజ్‌కుమార్, ఎం రోహిత్ పోలీస్ సిబ్బందిని డీసీపీ రాజా మాహేంద్రనాయక్ అభినందిచారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నర్సయ్య

కమ్యూనిస్టుల నాయకత్వంలోనే సాయుధ పోరాటం

స్టేషన్‌ఘన్‌పూర్: కమ్యూనిస్టుల నాయకత్వంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు జరిగాయని సీపీఎం మండల కార్యదర్శి రమేశ్ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సాల సందర్భంగా అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ, కరపత్రాల పంపిణీ కార్యక్రమాలను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. సాయుధ పోరాటం గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు.

'గిరిజన రిజర్వేషన్లను బలహీనపరిచే ప్రయత్నాలు'




తరిగొప్పుల: ప్రభుత్వాలు గిరిజన రిజర్వేషన్లను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని, సేవాలాల్ సేన అనేది ఒక పేరు మాత్రమే కాదని గిరిజనులు కోల్పోతున్న సంస్కృతి పరిరక్షణ, హక్కులు, సమానత్వం సాధన కోసం ఏర్పడిన ఉద్యమమని మాజీ ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్ అన్నారు. సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా రైతు సేన అధ్యక్షుడు ముడావత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి దారావత్ రమేష్‌నాయక్, బానోత్ సుమన్, గుగులోత్ ప్రవీణ్, అజ్మీరా కిషన్, మోతిలాల్, రాజు, సంపత్, రాజశేఖర్, రాజేందర్, భీంచంద్, థామస్ పాల్గొన్నారు.

వాన తెచ్చిన తంటా

- కాలనీల్లో వరద నీరు
- హైవేలపై కష్టాలు

జనగామ: జిల్లాలో రెండు రోజులు క్రితం దంచి కొట్టిన వానతో పట్టణంలోని పలు కాలనీలు జలమయం కాగా, అనేక చోట్ల రోడ్డు రవాణాకు ఆటంకాలు ఎదురయ్యాయి. పురపాలిక పరిధిలోని వినాయక నగర్, బాలాజీనగర్, జ్యోతినగర్, శ్రీనగర్ కాలనీ, కుర్మవాడ(కొంత భాగం), హైదరాబాద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వరద నీరు చేరి ఒకేచోట నిలువడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జనగామ–బచ్చన్నపేట హైవే చంపక్‌హిల్స్ బైపాస్ కోసం గుట్టను తవ్విన ప్రాంతంలో వరద నీరు వచ్చి ఒకే చోట నిలువడంతో బైక్‌లు మునిగి పోగా, కార్లు అందులోనే ఇరుక్కు పోయాయి. గత కొన్ని నెలలుగా రోడ్డు పనులు నింపాదిగా జరుగుతుండడంతో జోరు వర్షం కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి పునరావృతం అవుతుంది. వర్షాలతో శాశ్వత పరిష్కారం చూపించక పోవడంతో అటు ప్రజలు ఇటు రవాణా సేవలకు అంతరాయం తప్పడం లేదు.



వినాయకనగర్ కాలనీలో వరద



చంపక్‌హిల్స్ బైపాస్ నిర్మాణ ప్రాంతంలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

డబ్బులు ఇవ్వనందుకు విద్యుత్ లైన్ వేయడం లేదు

- రైతు ఆవేదన

స్టేషన్‌ఘన్‌పూర్: లంచంగా అడిగిన డబ్బులు ఇవ్వక పోవడంతో విద్యుత్ లైన్ వేయడం లేదని మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన రైతు తాళ్ల పెల్లి యాదగిరి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధితుడు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. యాదగిరి నమిలిగొండ గ్రామంలోని సర్వే నంబర్ 496/ఏ/3/1లోని తనభూమిలో డెయిరీ ఫాం ఏర్పాటు చేసుకున్నాడు. ఫాంకు విద్యుత్ సరఫరా కోసం శివునిపల్లి ఏఈ చెప్పిన విధంగా స్తంభాలు, లైన్ కోసం ఎస్టిమేట్ ఆఫ్ ఎక్స్‌పెన్స్ మొత్తం రూ.1,04,602లు విద్యుత్‌శాఖకు చెల్లించినట్లు తెలిపారు. దాంతో గత నెల 29న విద్యుత్ స్తంభాలు వేసిన సిబ్బంది లైన్లు వేయకుండా వదిలేశారన్నారు. లైన్ ఎందుకు వేయడం లేదని అడగగా రూ.20వేలు లంచం అడిగారని, సదరు డబ్బులు ఇవ్వనందుకే పనులు ఆపారని రైతు తెలిపాడు. స్తంభాలు వేసి రెండువారాలు గడుస్తున్నా ఇంతవరకూ లైన్ వేయడం లేదని, దాంతో విద్యుత్ సరఫరా లేక డెయిరీ ఫాంకు ఇబ్బందిగా మారిందని, ఆర్థికంగా నష్టపోతున్నానని రైతు పేర్కొన్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు. కాగా ఏఈ శివకుమార్ మాట్లాడుతూ విద్యుత్ లైన్ వేసేందుకు డబ్బులు అడిగినట్లు తమపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, విద్యుత్ లైన్ వేసేందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్తంభాలు వేశామన్నారు. అయితే పక్క భూమి రైతు అతడి భూమి నుంచి లైన్ వెళ్తుందని అడ్డు చెప్తున్నాడని తెలిపారు. ఈ విషయమై ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని పేర్కొన్నారు.



వివరాలు తెలుపుతున్న యాదగిరి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రజలకు ఇబ్బందులు

జనగామ రూరల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణ పనులు పూర్తవక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులో అండర్ డ్రెయినేజీ, రోడ్డు పనులను బొమ్మకంటి అనీల్‌గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోకల ఉమారాణి, తోకల హరీశ్, పెద్దోజు జగదీష్ తదితరులు ఉన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

దేవరుప్పుల: ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పలు రకాల పింఛన్ల పెంపు హామీలను అమలు చేయాలని 15వ తేదీన మండల తహసీల్ ఎదుట తలపెట్టిన మహాధర్నాలను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ధారావత్ స్వామినాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కామారెడ్డిగూడెంలో పలువురు పింఛన్‌దారులతో కలిసి ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టారు. వీహెచ్‌పీఎస్ సాంస్కృతిక విభాగం జిల్లా నాయకులు మేడ సుధాకర్, మంగళం వెంకటయ్య, గజ్జి లక్ష్మయ్య, మరిపెల్లి వెంకటయ్య, మరాఠి సోమక్క, దుద్దిళ్ల పుష్పమాల తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న స్వామినాయక్ తదితరులు